
# పోస్టు కార్డు

చావా శివకోటి



**జ**గం ప్రొద్దుటే వచ్చాడు.

జగం ఏమిటి అనుకోవద్దు - ముద్దుగా జనం వాణ్ణి అలా పిలుస్తారు. వాని పూర్తి పేరు జగన్నాథం - ఇంటి పేరేమో తిరుమలగిరి.

ఎండాకాలం గనుక - పొద్దు పొడుపే చురచురమంటూంది.

ఎఱ్ఱి ముద్ద కాంతులీనుతూ పైపైకి జరుగుతూంది.

ఆసుపత్రిన పొద్దు బాగా పోవడం మూలాన ఇంటికి చేరేసరికి నాకు అర్ధరాత్రి దాటింది. అప్పుడు స్నానపానాదులు ముగించుకుని పక్కెక్కి నిద్రకోసం పుస్తకాల్ని ఆశ్రయించాల్సి వచ్చింది. అయినా పెందళాడే మెలకువ వచ్చింది. కాకపోతే కళ్లు కొంచెం మంటగా అనిపించినయ్. బాత్‌రూంలో జొరబడి కాలకృత్యాలు తీర్చుకుంటే అంతా సద్దుమణుగుతుందని అటుగా నడుస్తుండగా మా పనిమనిషి దేవేరి బయటనుంచి వచ్చి తమకోసం ఎవరో వచ్చారు సార్!' అంది.

'వచ్చి కూర్చున్నాడు కదా! అయితే ఇన్ని కాఫీ పొయ్. ఈలోపు నేను వస్తాను' అంటూ లోనికి నడిచాను.

'అట్టాగే' నంటూ దేవేరి బయటికి నడిచింది.

నేను తయారయి బయటికి వచ్చాను. ఎదురుగా కుర్చీలో తిరుమలగిరి జగన్నాథం వార్తాపత్రికను నములుతూ కాఫీ సిప్‌చేయటం పూర్తి చేస్తున్నాడు.

"అరే జగం నువ్వ... ఏమిట్రా! ఏమిటి విశేషం" అన్నాను కుర్చీలో కూర్చుంటూ

'అంత ఇదయిన విశేషమేమీ కాదనుకోండి.'

'మరి?'

'చెప్తాను' అన్నాడు,

'సరే' అని సిగరెట్టు వెలిగించి అగ్గిపెట్టెపై కనిపించిన అర్ధనగ్న సుందరి అందాల్ని చూడడంలో నిమగ్నమయ్యాను.

నాకు పెళ్లి సంబంధం ఒకటి వచ్చింది. తాడేపల్లిగూడెం దగ్గరున్న పల్లెటూరు నుంచి. మన కులం గాదు. నేను కులమతాల పట్టింపు లేదని పేపరులో వేశాననుకోండి' అని నవ్వాడు సిగ్గుపడుతూ.

'అదేంటయ్యా? కులం పిల్లను సలక్షణంగా - సాంప్రదాయబద్ధంగా పెళ్లాడితివి కదా! నాలుగేళ్లు కాపురం చేస్తివి. ఆ పిల్లతో విడాకులు పుచ్చుకున్నావా?'

'ఆఁ!' అని తలూపాడు.

నా కీ విడిపోవడాలు వగైరా నచ్చవు. పైగా జగం చేసిన పని పూర్తిగా నచ్చలేదు. ఎంచేతనంటే- ఇతగాన్ని పెళ్లాడిన పిల్ల దోషి కాదు. పద్ధతయిన పిల్ల!

'నా జీతంలో నాల్గోవంతు - నెలనెలా ఆవిడకు పంపిస్తున్నాను. అట్టా కోర్టు ఆదేశించాక చేసేది ఏముంటుంది' అన్నాడు అతగాడి కేదో అన్యాయం జరిగినట్టు.

'జగం! అసలు నీకు పెళ్లాం అక్కర ఉందా?' అడిగాను.

'తోడు కావాలి గదా సార్! ఒంటరి తనంతో ఎన్నాళ్లుండను?' అన్నాడు.

'కుదురుగా ఉండలేనప్పుడు పెళ్లిళ్లు అనవసరం కదా' అని 'ఇంతకీ నేనుగా ఏం చేయాలో చెప్పావు గాదు' అన్నాను.

'నాకు ఇక్కడ ఉన్న పెద్ద దిక్కు మీరే గదా! నేనూ వెంట ఉంటాను. పని సానుకూల పడినా,

పడకున్నా వినండి.'

'వింటాను. నేనుగా మాట్లాడాల్సి వస్తే - వాస్తవమే మాటాడతాను మరి అది నీకు ఉపయోగపడదేమో?'

'సార్! ఇకపైన అబద్దాలపైన బ్రతకు నడవదలచుకోలేదు నా గతం ఇలాంటి అనుమానాల్ని కల్గిస్తుంది. జరిగిన దానికి పశ్చాత్తాప పడుతున్నాను. చెడ్డవానికి బ్రతుకులో మంచిగా మారే అవకాశం దొరకదంటారా? తప్పును తెలుసుకొనడం కంటే కావల్సిందేముంటుంది?'

జగమేనా మాట్లేడేది అనిపించింది. నమ్మబుద్ధి కాలేదు. కుక్కతోకలాంటి స్వభావం కల్గినవాడు గదా. మార్పు ఉంటుందని నమ్మలేం. కనుక 'నువ్వు ఇంకా అబద్దాలలోనే బ్రతుకుతున్నట్టుంది' అన్నాను.

తెల్లబోయాడు. 'అలా అనవద్దు సార్' అని చేతులు పట్టుకున్నాడు.

'జగం! నీ భార్య ఇప్పటికీ అలాగే ఉంది గదా. జరిగిన దానికి పశ్చాత్తాపపడ, తిరిగి తెచ్చుకుంటే ఎంత బావుంటుంది?' అన్నాను.

కూర్చున్న చోటునుంచి పేల ముఖంతో లేచాడు జగం. మాటాడలేదు.

'వెళ్తున్నావా?'

'మీరు నన్ను నమ్మలేకపోతున్నారు' అన్నాడు ఆగి.

'నమ్మకకు ఒక హద్దు ఉంటుందయ్యా! గీత దాటాక సీతకేమైందో మనకు తెలుసు. మనమెంత' అన్నాను నవ్వుతూ.

'జరిగింది కలగా మరచిపోయాను సార్! జరిగిన పొరపాటు తెల్సు. సరిచేసుకునే అవకాశం రావాలి గదా. అందుకు సమాజం అనుమతించాలి. మీకు తెలియంది కాదిది' అన్నాడు.

'నువ్వెన్ని చెప్పినా - నువ్వు ఇప్పుడు చేయదలచింది న్యాయంగా నాకు అనిపించడం లేదు. అనిపించినప్పుడు చూద్దాం' అని లేచాను.

'మీరు ఆసుపత్రికి వచ్చాక అతగాణ్ణి వెంట పెట్టుకు వస్తాను' అన్నాడు

నవ్వి - 'నన్ను వదిలేయరాదూ?' అన్నాను.

'నా పేపరు ప్రకటనను చదివి - నాపైన సదభిప్రాయంతో అతనొచ్చాడు. సంస్కార యుతమైన కుటుంబంలా అనిపించింది.

'మనకూ ఉండాలి కదా' అన్నాను నవ్వుతూనే.

జగంలో మార్పు మాత్రం అంతగా కనిపించలేదు - రాదు కూడా! అతని స్వభావం నాకు బాగా తెల్సు. కానీ -

జగం నాకు ఎవ్వరూ చేయలేనంత మేలు - అబద్ధాలతోనే- చేశాడు గనుక తల ఊపాను.

ఒకసారి - నా అనారోగ్యం మూలాన పరీక్షలకు మద్రాసు వెళ్లాను. జగం నాతో వచ్చాడు తోడుగా. తిరిగి వస్తున్నాం. రైలు సూళ్లూరుపేట దాటుతుండగా నాకు కడుపు నొప్పి ప్రారంభం అయింది. రాను రాను భరించరానిదిగా తయారయింది. ఇందుకు గాను నేను ఎప్పుడూ తీసుకునే ఇంజక్షన్ దగ్గర లేదు. నాకు ఆ బాధ తట్టుకునే స్థితి కనిపించలేదు. నన్ను గమనించిన జగం ప్రక్క చిన్న టైను రాగానే చైన్ లాగాడు. టి.సి.లకూ గార్డుకూ ఎదురెళ్లి సి.ఎం. గారి మేనల్లుడి పరిస్థితి విషమించింది. వెంటనే ఈ ఇంజక్షన్ చేయాలి అంటూ టౌను లోనకు పరుగెత్తికెళ్లి తెచ్చి చేశాడు. ఆనకనే రైలు కదిలింది. నిజంగానే ఇది జరిగినా, కలలా అనిపిస్తుంది. ఇలాంటి సాహసాన్ని మరే మిత్రుడున్నా చేయలేడు గదా!

అతను ఆడినవన్నీ అబద్ధాలే! నాకు తెలుసు కానీ, వాటితోనే గదా నన్ను ప్రమాదం నుంచి బైట పడేసింది.

అందుకే 'సాయంత్రం కిన్నెర హోటలు దగ్గర కలుద్దాం' అన్నాను.

'అలాగే! అతనూ రూమ్ నెం. 111లో ఉన్నాడు' అంటూ సంతోషంగా వెళ్లిపోయాడు.

★ ★ ★

నేను సాయంత్రం కిన్నెర హోటలులో కారు దిగేసరికి జగం నా కోసం ఎదురు చూస్తూ కనిపించాడు.

అతని వెనక - రివటలాంటి మరో మనిషి మొక్కుబడి కోసం పెంచిన గడ్డంతో- పొడవుగా కనిపించాడు. 'డాక్టరుగారొచ్చారు' అని అతగానికి సైగ చేశాడు. ఆ వెంటనే అతనూ ఎదురుగ్గా వచ్చి నమస్కారం చేశాడు. అతని మొఖాన చిరునవ్వు లాంటిది లిప్తకాలం మెదలి మాయమైనట్టుగా అనిపించింది తప్ప ఏ భావనా నాకు స్ఫురించలేదు.

'గదిలో కెళ్దాం' అన్నాడు జగం వినయంగా.

నడిచాను. నా వెంట ఇద్దరూ వచ్చారు.

మెట్లు ఎక్కుతుండగానే- 'నా పేరు సత్యమూర్తి' అన్నాడు.

తలూపాను.

'మా నాన్నగారు ఆయుర్వేదంలో నిష్ణాతుడు. బహుశా ఆయన పేరు తమరూ వినే ఉంటారు' అన్నాడు.

'పేరు?' అడిగాను.

'ఎలిగండ్ల శ్రీనివాసాచార్యులవారు' అన్నాడు గర్వంగా.

'నా కా పేరు ఎక్కడా తగిలిన జాడ లేదు. ముక్యాల శాస్త్రిగారి పేరు విన్నాను.'

ఇంతలో గది ముందు కొచ్చాం.

జగం తాళం తీశాడు. గదిలోకి నడిచాను.

నేను మంచంపై కూర్చుంటుండగానే జగం బేరర్‌ను పిలిచి కాఫీ చెప్పాడు.

'ఇక్కడే భోజనం చేశారా' అడిగాను సత్యమూర్తిని

తల ఊపాడు,

వెంటనే విషయంలోకి వచ్చే ప్రయత్నం చేశాడు జగం.

సత్యమూర్తి నింపాదిగా కనిపించాడు.

కాఫీ వచ్చింది.

కాఫీ త్రాగుతూ 'సత్యమూర్తి గారూ మీరు జగానికే పిల్ల నిద్దామనే అభిప్రాయానికెందు కొచ్చారు?' అడిగాను.


హఠాత్తుగా వచ్చిన ఈ ప్రశ్నకు కూర్చున చోటు నుంచి కొంచెం అటూ ఇటూగా కదిలి 'చెప్తాను' అన్నాడు నవ్వు ముఖంతో.


కాఫీ కప్పు క్రింద పెట్టి ప్రారంభించాడు. 'పేపరులో ప్రకటన చదివాక ఈ జగాన్ని కల్సుకోవాలి అనిపించింది. ప్రకటనలో నిజాయితీ కనిపించింది. మంచివాడెవడో బ్రతుకున దగా పడిన ఛాయలు కనిపించినయ్. కలవంది విషయం అవగతం కాదు కదా! అయినా ఈ సమాజాన దగా పడక పోవడమే విశేషం. ఏమంటారు?' అని నవ్వి- 'అందుకే వచ్చాను కలిశాను. నన్నుగా నేను పరిచయం చేసుకున్నాను. మాటాడాను. రెండు దినాలుగా అతనితోనే ఉంటున్నాను. ఈలోపు నాకు కొంత అర్థమైంది. అనేక ఘటనలు బ్రతుకున మనని మననిగా మిగలనివ్వవు. అలాటి చేదు అనుభవాలూ - నాకూ ఎదురయ్యాయి. ఎంతటి ఆత్మస్థయిర్యం ఉంటేనో బయట పడగలం' అని ఓ క్షణం ఆగి - డాక్టరుగారూ! నేను నా చెల్లెల్ని జగానికి ఇవ్వదలిచాను. ఇది న్యాయంగా మా కుటుంబాన కులాంతర వివాహం అవుతుంది' అన్నాడు.

నేను సత్యమూర్తి ధోరణిని పట్టించుకొనకుండానే 'అమ్మాయి ఎంతవరకూ చదివింది?' అనడిగాను.

'బిఎస్‌సి పూర్తి చేసింది - ఉద్యోగావకాశం వచ్చినా చెయ్యడం లేదు.'

'ఎప్పుడు పాస్ అయ్యింది'






'నిరుడు!'

'ఏ ఉద్యోగం అయితే చేస్తుంది?' అన్నాను నవ్వుతూ.

'ఒక ఉద్యోగం పట్ల నా చెల్లి ఆసక్తి కనపరిచింది కానీ మా నాన్నగారు అందుకు అంగీకరించలేదు' అని నా వైపు తిరిగి 'మా చెల్లి పేరు చెప్పానా' అని- 'చెప్పిన జాడ లేదు కదూ!'అని సణగుకుని 'నిర్మల' అన్నాడు.

'నేనింకా అడగందే' అని నవ్వాను.

ఆ వెంటనే చంక సందున చేతులు దూర్చి వెలికి ఒక కవరు బయటకు తీసి అందున్న రెండు ఫోటోలు నాకు ఇచ్చాడు.

నేను చూసి జగాని కిచ్చాను. పెళ్లాడేది వాడు కదా!

పిల్ల నాకళ్లకు సలక్షణంగానే అనిపించింది. నిర్మలత ఉందా ముఖాన. కనుముక్కు తీరుగానే అనిపించింది. రంగు చూస్తే కాని తెలియదు. నాగరకపు వాసన ఆవిడ ఫోటోలో కనిపించలేదు. ముక్కు కొసన పెసర పలుకంత గోధమ వర్ణపు పుట్టుమచ్చ కనిపించింది. కళ్లలో చురుకు పాలు కనిపించింది. నుదుట బొట్టు నిండుగా అనిపించింది. జగం వైపు చూశాను.

తృప్తి కనిపించింది అతని మొఖాన.

'ఈవిడ అన్న మాట మీ చెల్లెలు' అన్నాను.

తలూపాడు.

'మీ పోలికలు అసలు లేవు' అన్నాను నవ్వుతూ.

'అది నాన్నగారి పోలిక. నాకు అమ్మ పోలిక' అని 'అలా ఉండడం గొప్ప అదృష్టంగా చెపుతారు మన వాళ్లు' అన్నాడు.

జగం అవునన్నట్లు తలూపాడు.

'మరిక ఆలస్యం ఎందుకు- కట్నకానుకల మాట అనుకుంటే పోతుందికదా' అన్నాను.

'ఆదర్శ వివాహం చేసుకుందామను కుంటున్నాను. మిగతా విషయాలు మాటాడేదేమీ లేదు' అన్నాడు జగం.

'అయ్యా డాక్టరుగారూ!' అంటూ మధ్యలో కొచ్చాడు సత్యమూర్తి.

'కట్నం అనేది దురాచారంగా భావించేవాణ్ణి నేను. కానీ దాని వాటా దానికివ్వాలి కదా! తోబుట్టువుగా అది నా ధర్మం. మా నాన్నగారు మా అమ్మగారి పుట్టింటిపరంగా వచ్చిన- పన్నెండెకరాల మామిడితోటను మాత్రం- నిర్మల పేర రాసి ఉంచారు. దానిపై ప్రస్తుతం ఎంత లేదన్నా ఎనభై వేల ఐవేజు ఇప్పుడు వస్తూనే ఉంది. అయితే న్యాయానికి ఇది నావాటా కంటే తక్కువ. ఏది ఏమైనా దాని ఆస్తిపైన మాకెలాంటి అభ్యంతరం ఉండరాదు' అన్నాడు.

'నా కీ ఆస్తిపాస్తులు నచ్చవు' అన్నాడు అదోలా ముఖం పెట్టి.

'మా నిర్మలతో అదీ వస్తుంది - అలా ఇష్టపడితేనే' అన్నాడు సత్యమూర్తి.

సుక్షేత్రమైన తోట. అంటే దాదాపు పదిహేను లక్షల రూపాయల ఆస్తి - దాన్ని వీరిద్దరూ నాకొద్దు నాకొద్దు అనుకోవడం చూశాక నాకు నవ్వు ఆగలేదు.

అయినా చూస్తూ ఊర్కున్నాను.

'పూచిక పుల్ల పిల్ల వెంట వచ్చినా దాన్ని కట్నంగా భావిస్తాను' అన్నాడు జగం

'ఎవరేమన్నా అది పిల్లదాని ఆస్తి. దాంతోనే అదీ ఉంటుంది. నేను అంత దూరం నుంచి పిల్లనిద్దామనే ఉద్దేశ్యంతో వచ్చాను. ఈ ఆస్తి మనకు ప్రతిబంధకం కాకూడదు' అన్నాడు సత్యమూర్తి.

'జగం! పిల్ల నీకు నచ్చింది కదా?' అన్నాను మధ్యలో కొచ్చి.

తల ఊపాడు.

'అయితే పెళ్లయ్యాక దాన్ని ఏ దేవాలయానికో రాసి ఇద్దూగానిలే' అన్నాను.

ఇద్దరూ తలలూపారు.

'శుభం' అని లేచాను.

'మరి పెళ్లిచూపులు?' అడిగాడు సత్యమూర్తి.

'మీరు వెళ్లి వివరాలు కార్డు వ్రాయండి'అన్నాను.

అలాగే అని లేచి - 'డాక్టర్‌గారూ! తమరు తప్పక రావాలి' అన్నాడు సత్యమూర్తి.

తలూపి క్రిందకి దిగాను.

★ ★ ★

వారం తరువాత జగం కనిపించాడు.

'ఉత్తరం వచ్చిందా?' అడిగాను.

'రావచ్చు' అన్నాడు సంతోషంగా.

'అసలతనెవరో - లోగడ తెలుసా' అడిగాను - ఆగి.

నవ్వాడు జగం.

'ఆదివారం అయితే తప్ప నే రాలేను' అన్నాను.

'చూద్దాం లెండి సార్!' అన్నాడు.

నాకు హైదరాబాదులో పనుండి ఆ వేళే బయలుదేరాను.

వచ్చేసరికి ఎనిమిది రోజులయింది.

తెల్లవారి ఆసుపత్రికి బయలు దేరాను.

నేను కారులోకి అడుగుపెడుతుండగా జగం వచ్చాడు.

హుషారుగా లేడు.

ముఖం బాగా డోక్కునిపోయి ఉంది.

'ఉత్తరం వచ్చిందా?' అన్నాను నవ్వుతూనే.

అవును, కాదు అనకుండా నా దాపు కొచ్చి పోస్టు కార్డు ఒకటి నా చేత ఉంచి పరుగులాంటి నడకతో వెళ్లిపోయాడు.

'జగం' అని పిలిచినా ఆగలేదు.

ఇక మంచిది కాదనుకుని కార్డు చదివాను.

'శ్రీ జగన్నాథం గార్కి నమస్తే ...

ఉభయకుశలోపరి,

నేను తమ వద్ద శెలవు తీసుకుని నా చోటుకు క్షేమంగా చేరాను. మీ ఆదరణా, మంచితనం- నన్ను నిజంగా కదిల్చింది. ఒక్క మీ మొదటి భార్య విడాకుల విషయం తప్ప.

మీ డాక్టరుగారికి నమస్కారాలు చెప్పండి.

ఇక- ఆకలి ఈ సమాజాన ఏ రకమైన తప్పునైనా చేయించగలదు.

మీకు తెలీని విషయమూ గాదిది. పేపరున మీరిచ్చిన ప్రకటన నన్ను మీదాపుకు నడిపించింది.

నిజానికి నాకు అప్ప చెల్లెళ్లు లేరు. నాన్న లేడు. గతించి పుష్కరమైంది. మామిడి తోట కాదు కదా! ఓ చెట్టు కూడా లేదు. ఒక వేళ ఎవరైనా ఊర్కే మొక్క ఇచ్చినా నాటుకునేందుకు గజం చోటూ లేదు. నలభై రూపాయల అద్దె తాటాకుల గుడిసె నా అడ్రసు దొరకని చోటు. అనామకంగా కాలం గడుపుతున్నవాణ్ణి. మీరు నాకు వచ్చేటప్పుడు ఇచ్చిన ఇరవై అయిదు వందల రూపాయలూ నాకు రెండు నెలల గ్రాసం. ఇప్పటికి విషయం పూర్తిగా అర్థమైంది కదూ! కనుక క్షమించండి.

ఉంటాను -

ఈ రెండు నెలల గ్రాసంతో బ్రతుకు తెల్లారదుగా!

ముందు జాగ్రత్తగా మరో మూగ జీవాన్ని వెతుక్కోవాలి గదా! అదే వేటలో బయలు దేరుతూ ఈ కార్డు వ్రాస్తున్నాను.

అన్యథా భావించవచ్చు -

'మీ సత్యమూర్తి.'

నా చేతనున్న కార్డు నేల జారి గాలికి ఎగురుతూ గేటు దాటి పోయింది.

జగం స్థితి జాలి కలిగించింది.

బాధగా కారెక్కుతుండగా 'అసలు భార్యను తెచ్చుకుంటే ఈ తిప్పలెందుకు' అనిపించింది. కానీ ఇది జరిగేపని కాదని నాకు తెలుసు.

కారెక్కాను. కదిలింది.